

ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

తుదిదశలో స్కై, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

● ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సాగర్ రింగ్‌రోడ్‌లో స్కై, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం వాటి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.658 కోట్లతో ఎల్‌బీనగర్‌లో స్కై, ఫ్లైఓవర్లు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎల్‌బీనగర్ చౌరస్తాను సిగ్నల్ రహిత చౌరస్తాగా మార్చామని, దాదాపు అన్ని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎల్‌బీనగర్ జంక్షన్ వద్ద కుడి, ఎడమ ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, నాగోల్ జంక్షన్ ఫ్లైఓవర్, కామినేని జంక్షన్ వద్ద రెండు వైపులా ఫ్లైఓవర్లు, చింతలకుంట జంక్షన్ వద్ద అండర్‌పాస్, బైరామల్‌గూడ (లేఖ్య టవర్స్) జంక్షన్ వద్ద రెండు ఫ్లైఓవర్లు నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం అలేఖ్య టవర్ వద్ద సెకండ్ లెవల్ నూతన స్కై, ఫ్లై ఓవర్ పనులు తు దిదశకు చేరుకున్నాయని, సంక్రాంతి నాటికి పూర్తి అవుతాయని తెలిపారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రమోయిన శ్రీనివాసరావు, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం బృందం

పాఠశాలలో షీ టీం అవగాహన సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తట్టిఅన్నారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం వనస్థలిపురం షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీం ఇన్‌చార్జీ, ఏఎస్‌ఐ జ్యోతి మాట్లాడుతూ డయల్ 100, బాల్య వివాహాలు, వేధింపులు, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, ఆపద సమయంలో వ్యవహరించాల్సిన విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పర్వీన్, నవీన్, హెచ్‌ఎం ప్రభాకర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తట్టిఅన్నారంలో ప్రభుత్వ సర్వే నంబర్ 127/1లో అక్రమ కట్టడాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తుకు గురువారం వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల క్రితం సీపీఎం పోరాటంతో అధికారులు భూమికి హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల కొందరు ప్రభుత్వ బోర్డును తొలగించి నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మునీందర్‌రెడ్డి, సర్వయ్య, మల్లయ్య కాజా సుధాకర్ పాల్గొన్నారు.

దరఖాస్తు కేంద్రాలను సందర్శించిన ఆర్‌డీ



దరఖాస్తుదారుల జాబితాను పరిశీలిస్తున్న రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. గురువారం పెద్దఅంబర్‌పేట్ ప్రభుత్వ పాఠశాల, అంబేద్కర్ భవన్‌లోని దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. వారి వెంట టీపీఓ శ్రీకాంత్ ఉన్నారు.

కాంగ్రెస్ పాలన దివ్యాంగులకు స్వర్ణయుగం

దివ్యాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ వీరయ్య

ఓల్డ్‌మలక్‌పేట జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో దివ్యాంగులకు స్వర్ణయుగమని ఆ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. లూయిస్ బ్రెయిలి జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం మలక్‌పేటలోని దివ్యాంగుల కార్యాలయానికి వచ్చిన మంత్రి సీతక్కను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అంధుల తరపున మంత్రికి ధన్యవాదాలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దివ్యాంగుల ఆత్మబంధువని, హామీ మేరకు దివ్యాంగురాలికి ఉద్యోగం ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యం నింపారని అన్నారు. త్వరలోనే దివ్యాంగులకు పెన్షన్ పెరుగుతుందన్నారు దివ్యాంగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం గ్రేటర్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, సురేష్ పాల్గొన్నారు.

సన్మానం..

మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మలక్‌పేటకు వచ్చిన సీతక్కను ఆ పార్టీ నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి వారికి సూచించారు. మంత్రిని సన్మానించిన వారిలో నయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్, కృపాకర్‌రెడ్డి తదితరులున్నారు.

సారస్వత పరిషత్తు వచన కవిత అధ్యయన శిబిరం

గోషామహల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవల నిర్వహించిన యువ రచయిత్రుల సమ్మేళనానికి కొనసాగింపుగా ఫిబ్రవరి 11న వచన కవిత్వంలో అధ్యయన శిబిరం నిర్వహిస్తున్నట్లు పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్యలు తెలిపారు. అబిడ్స్ తిలక్ రోడ్డులోని పరిషత్తు ప్రాంగణంలో నిర్వహించే ఈ శిబిరంలో కవిత్వ భాషా శైలి, శీర్షిక, వస్తువు, శిల్పం, ఎత్తుగడ, నిర్వహణ ముగింపు మొదలైన అంశాలపై ప్రముఖ కవులు, విమర్శకులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. యువ రచయిత్రుల సమ్మేళనంలో పాల్గొన్న వారిలో సుమారు 50 మందిని వారి కవితలను పరిశీలించి ఎంపిక చేశామని.. ఎవరైనా పాల్గొనదలిస్తే ఇటీవల రాసిన స్వీయ కవితను, ఇతర వివరాలతో దరఖాస్తు చేస్తే ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను 9603727234 వాట్సాప్ నంబర్‌కు ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తులను పంపాలని కోరారు.

ఆధార్ కేంద్రం లేక అవస్థలు..

పట్టించుకోని అధికారులు, పాలకులు ● మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని డిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడంతో అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆధార్ సేవల కోసం 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని హయత్‌నగర్, వనస్థలిపురానికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 18 గ్రామ పంచాయతీలతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఏర్పాటైంది. ఇక్కడ ఒక్క ఆధార్ కేంద్రం కూడా ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర వాటికి ఆధార్ కార్డు కీలకమని, మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తిచేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హయత్‌నగర్‌లో ఆధార్ కేంద్రం ఉన్నా నిర్వాహకులు నచ్చినప్పుడే మాత్రమే తీస్తున్నారు. కొద్దిరోజులుగా కేంద్రం మూసి ఉండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు నిరాశతో వెనుతిరుగుతున్నారు. కొత్త ఆధార్ కార్డు తీసుకోవాలనుకున్న వారికి, ఆధార్ అప్‌డేట్ చేయించుకునే వాళ్లకు ఇబ్బందులు తప్పడం లేదు.

గంటల తరబడి బారులు తీరాల్సిందే..

ప్రజా అవసరాలకు అనుగుణంగా ఆధార్ నమోదు కేంద్రాలు లేవు. అక్కడక్కడ ఉన్నా విపరీతమైనా రద్దీ ఉంటుంది. క్యూలైన్‌లో గంటల తరబడి బారులు తీరుతున్నారు. ఉమర్‌ఖాన్‌గూడ, పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, వనస్థలిపురంలో మాత్రమే ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా కేంద్రాలకు ప్రజలు పోటెత్తుతున్నారు. ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని మీసేవా కేంద్రాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నా నిర్వాహకులు చేతివాటం చూపిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సూచించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.



హయత్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఆధార్ సెంటర్

మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి..



అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ సేవల కోసం నగరానికి వెళ్లాల్సి వస్తోంది. అక్కడ రద్దీ ఎక్కువగా ఉండడంతో రెండు, మూడు రోజులు తిరగాల్సి వస్తోంది.

\- నూతి సత్యానంద్, అబ్దుల్లాపూర్‌మెట్

కేసీఆర్ పథకాలను కాంగ్రెస్ కొనసాగించాలి

మాజీ మంత్రి సబితారెడ్డి సూచన



మీర్‌పేట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సూచించారు. కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారం కలిపి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని ఆమె గుర్తుచేశారు. గురువారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తే తమ సహకారం అందజేస్తామని, పథకాలను పక్కదారి పట్టిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, కమిషనర్ ఎ.వాణీరెడ్డి, కౌన్సిల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్జున్, కమిషనర్ బి.సుమన్‌రావు, బాలాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



అయోధ్య రామయ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న నేతలు



రామజన్మభూమి అక్షింతల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

మన్సూరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పంపించిన అక్షింతలను మన్సూరాబాద్ డివిజన్‌లోని మధురానగర్, కాస్మోపాలిటన్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, చండీశ్వరి కాలనీలో గురువారం గడపగడపకు పంపిణీ చేశారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ఇంటికి అక్షింతలు చేరే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

పెద్దఅంబర్‌పేట్ 5వ వార్డులో..

అబ్దుల్లాపూర్‌మెట్: అయోధ్య రామయ్య అక్షింతలు, కరపత్రాలను గురువారం పెద్దఅంబర్‌పేట్ 5వ వార్డులోని పలు కాలనీల్లో గడపగడపకు తిరిగి పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నేత చెరుకూరి జగన్, పోరెడ్డి వేణురెడ్డి, రాచమల్ల సుధాకర్, అరవింద్‌యాదవ్, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం కావాలి..

● కోదండరాం



సదస్సులో మాట్లాడుతున్న కోదండరాం

చార్మినార్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణే అందరి ధ్యేయం కావాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. సిటీ కాలేజ్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరాం మాట్లాడుతూ నాగరిక జీవితం గడపాలంటే తప్పనిసరిగా రాజ్యాంగ సూత్రాలను పాటించాలన్నారు. రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తేనే ఆర్థికాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ బాల భాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగంపట్ల, రాజ్యాంగంలోని కీలకమైన సాంకేతిక పదాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలనే సంకల్పంతో ఈ సదస్సు నిర్వహించామన్నారు. ప్రొఫెసర్ డా.కె.భాస్కర్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులకు ప్రొఫెసర్ కోదండరాం ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. ఉపసంచాలకులు డా.షహజాద్, ప్రొఫెసర్లు, విద్యార్థులు

నేరాల నియంత్రణకు ఆర్‌పీఎఫ్ కృషి

● 693 మంది అరెస్టు...

● రూ.1.97 కోట్ల రైల్వే ఆస్తి స్వాధీనం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) నేరాల నివారణకు నిరంతరం కృషి చేస్తూనే అక్రమార్కులను అరెస్టు చేసి ప్రయాణికుల్లో విశ్వసనీయత పెంచింది. రైళ్లు, రైల్వేస్టేషన్లలో నేర కార్యకలాపాలను విజయవంతంగా నియంత్రించినట్టు అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది రైల్వే వస్తువులు అపహరించిన, ఆస్తులను ఆక్రమించిన 693 మందిని అరెస్టు చేసి రూ.1.97 కోట్ల రైల్వే ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. నడుస్తున్న రైళ్లపై రాళ్లు రువ్వినందుకు 401 కేసులు నమోదు చేసి 327 మందిని అరెస్టు చేశారు. 161 మందిని అరెస్టు చేసి 23.09 కోట్ల విలువైన 3,239 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లను అనధికారికంగా విక్రయించినందుకు 261 మందిని అరెస్టు చేసి రూ.2,30,59,680 విలువ చేసే 8770 టిక్కెట్లను రైల్వే రక్షణ దళం స్వాధీనం చేసుకుంది. టికెట్ లేకుండా రిజర్వేషన్ బోగీలో ప్రయాణించిన 702 మంది నుంచి రూ. 1.47 లక్షల జరిమానా వసూలు చేసినట్టు తెలిపారు. ఫుట్‌బోర్డ్‌లపై ప్రయాణించినందుకు 627 మందిని పట్టుకున్నారు. టిక్కెట్ లేకుండా ప్రయాణించిన 1903 మంది వద్ద రూ.1.36 లక్షల జరిమానా వసూలు చేశారు. రైళ్లలో ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను తీసుకెళ్తున్న 19 మందిని అరెస్టు చేశారు. రైల్వే ప్రాంగణంలో ప్రయాణికుల వస్తువులను దొంగిలించిన 454 మందిని అరెస్టు చేసి 9.36 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

'ప్రజా రవాణా వ్యవస్థ బలపడింది'

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా రవాణా వ్యవస్థ బలపడిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీ ప్రాధాన్యం పెరిగిందని ప్రొఫెసర్ ఎం.కోదండరాం పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో దెబ్బతిన్న ఆర్టీసీని అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కార్యాచరణ ప్రణాళిక చేపట్టబోతున్నారని తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సికింద్రాబాద్, హైదరాబాద్ రీజియన్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కోదండరాం హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమూద్, వైస్ చైర్మన్ జక్కుల మల్లేశం, అదనపు ప్రధాన కార్యదర్శి అబ్రహం మాట్లాడారు. ఆర్టీసీలోని వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు చెల్లించాలని, వేతన సవరణ చేయాలని, ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, సీసీఎస్ బకాయిలు చెల్లించాలని, కార్మికులకు పీఎఫ్ డబ్బులు ఇవ్వాలని, ఉచిత బస్సు ప్రయాణం వల్ల జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం ప్రతి నెలా చెల్లించాలని, వనభోజనాలు రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా నల్గొండ, సూర్యాపేటలో సీఎం, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పెట్టిన ఫ్లెక్సీలను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.సత్యనారాయణరెడ్డి, ఆర్.డి.చంద్రశేఖర్, నాగన్నగౌడ్, తిరుమలేష్, జె.గోపాల్, అఫ్జల్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో కేటీఆర్ చిత్రపటం దహనం

కాంగ్రెస్ మేనిఫెస్టోను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా..

తార్నాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మేనిఫెస్టోను కించపరుస్తూ... అది 420 అని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలను నిరనిరసిస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చనగాని దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికాంలోకి వచ్చి నెల కూడా కాలేదని, పదేళ్లపాటు మంత్రిగా పనిచేసిన వ్యక్తి, అధికారం చేజారగానే మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వంపై విషం చిమ్మడం ఎంతవరకు సమంజసమని తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు పదేళ్లపాటు కేసీఆర్‌కు అధికారాన్ని అప్పగిస్తే తెలంగాణ సంపదను కేసీఆర్ కుటుంబం పూర్తిగా దోచుకుందని ఆరోపించారు. కేటీఆర్ తన వైఖరి మార్చుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లాలని కుట్రలు పన్నితే, తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఘాటుగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ ఓయూ ప్రెసిడెంట్ మెడ శ్రీను, మహేష్ గౌడ్, విజయ్, సుమన్, వీరేందర్, బాలకృష్ణ పాల్గొన్నారు.



ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తదితరులు



గడ్డిఅన్నారం న్యూ కమ్యూనిటీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్యాంరావు, ప్రధానకార్యదర్శి బి.లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు ఎస్.ధర్మేందర్‌లు ప్రజా పాలనలో బుధవారం అధికారులకు వినతి పత్రం సమర్పించారు. -(చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి)



ముసారాంబాగ్‌లోని అండాళ్ నిలయంలో జరుగుతున్న తిరుప్పావై వేడుకల్లో సుమారు రెండు వేల మంది మహిళలకు నిర్వాహకులు ఎ.లక్ష్మీదేవి, రూపాదేవి పసుపు, కుంకుమలు, గాజులు, కొబ్బరికాయలను వాయినాలుగా అందజేశారు. -(చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి)



గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో గురువారం అయోధ్య రాముల వారి కరపత్రం, అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. గండి పన్నీయాదవ్, పూర నర్సింహగుప్తా, కల్లెం మధుసూదన్, సత్యనారాయణ, అనంతాచారి పాల్గొన్నారు. (దిల్‌సుఖ్‌నగర్,ఆంధ్రజ్యోతి)

మైనర్‌ను మోసం చేసిన నిందితుడికి పదేళ్ల శిక్ష

రంగారెడ్డి కోర్టులు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో మైనర్‌ను మోసం చేసిన నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 30 వేల జరిమానా, రూ.5 లక్షల నష్టపరిహారం విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు వెల్లడించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునిధ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి... గడ్డిఅన్నారానికి చెందిన వినయ్ 16 సంవత్సరాల మైనర్‌ను ప్రేమ, పెళ్లి పేరిట లోబరచుకుని, ఆ తరువాత బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన పోక్సో కోర్టు న్యాయాధికారి ఎం.కే.పద్మావతి నిందితుడికి శిక్ష విధించారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ సాయి సరస్వతి అపార్ట్‌మెంట్స్‌లో ఈడుపుగంటి చిన సాంబశివరావు(65) నివసిస్తున్నాడు. గతంలో ప్రైవేటు ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. కొంతకాలం కోల్‌కతాలో కుమార్తె వద్ద ఉన్నాడు. 20 రోజుల క్రితం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీలో ఒంటరిగా ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం వరకు సాంబశివరావు తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అతడు రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిరాణా షాపునకు వెళ్లి వస్తుండగా..

ద్విచక్రవాహనం ఢీకొని వాచ్‌మన్ మృతి

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల సీబీసీఐడీ అపార్ట్‌మెంట్‌లో సంగారెడ్డి జిల్లా అంతెర్‌గాన్ గ్రామానికి చెందిన భూతలి బాలరాజు(41) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల ఒకటో తేదీ రాత్రి 10 గంటల సమయంలో కిరాణా షాపునకు వెళ్లాడు. తిరిగి వస్తూ హైదర్‌నగర్ పోచమ్మగుడి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు బాలరాజు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ..

ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట రంగారెడ్డినగర్‌కు చెందిన ఆదెపు శైలజ(34) కేపీహెచ్‌బీ కాలనీలో నెక్సస్ ఫోరం మాల్ సమీపంలోగల ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గురువారం ఉదయం జగద్గిరిగుట్టలో ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై కార్యాలయానికి వెళ్తోంది. కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శైలజను స్థానికంగాగల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

లారీ ఢీకొని యువకుడు...

పహాడిషరీఫ్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన లారీ ఓ బైక్‌ను ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ యూసుఫ్ జానీ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చాంద్రాయణగుట్ట నుంచి బైక్ (ఏపీ 29 ఏఆర్ 5053)పై పహాడిషరీఫ్ వైపు వెళ్తుండగా.. ఎర్రకుంట చౌరస్తా వద్ద గుంతల మయంగా ఉన్న రోడ్డులో వేగంగా వచ్చిన లారీ (ఏపీటీ 5487) ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.